క్లుప్తంగా

పోషకాహారం శ్రేయస్కరం



మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: అంగన్‌వాడీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పల్లపు వీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. సూరిశెట్టి అప్పలనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



విరాళం అందజేస్తున్న ఒంపోలు పేట భక్తుడు రామకృష్ణ

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని ఒంపోలు పేటకు చెందిన శ్రీపతి రామకృష్ణ–దేవీ దంపతులు వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం రూ.10,116 బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకుని రూ.5 కోట్లతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, జల్లేపల్లి కిష్టప్ప, నరాలశెట్టి సూర్యనారాయణ, శరగడం జగన్నాథరావు, శివ, కర్రి పెదబ్బాయి, బలిరెడ్డి సూరిబాబు, గంగాధర్, మురళి పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి



పెదరాంభద్రపురంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

పాయకరావుపేట: మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో ఎ.జయప్రకాష్ రావు తెలిపారు. మండలంలో పెదరాంభద్రపురం, పాల్తేరు గ్రామాల్లో ఆయన శనివారం సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని అరటికాయల మార్కెట్‌లో గతంలో అన్నక్యాంటీన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఎంపీడీవో కార్యాలయం ఈవో, పాయకరావుపేట గ్రామ పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి సిహెచ్ వర్మ పాల్గొన్నారు.

ఆండాళ్లమ్మకు సారె



ఆండాళ్లమ్మకు సారె సమర్పించిన భక్తులు

పాయకరావుపేట: పట్టణంలో రాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో స్వామివారు వామానావతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆండాళ్లమ్మకు భక్తులు సారెను సమర్పించారు. పాండురంగ స్వామికి, ఆండాళ్లమ్మకు, గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణస్వామి తీర్థప్రసాదాలు అందించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎస్.రాయవరం: సైతారుపేటకు చెందిన గజ్బల్లి రామకృష్ణ 26 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా ఎస్.రాయవరంలో పట్టుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు శనివారం తెలిపారు. స్థానిక మద్యం దుకాణం నుంచి సైతారుపేటలో బెల్ట్‌షాపునకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.



పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు



రాత్రిళ్లు గోడలపై కోతుల సంచారం



వీధుల్లో కుక్కల సంచారం

పందులు.. కోతులు.. కుక్కలు

పాయకరావుపేటలో విచ్చలవిడిగా సంచారం
బెంబేలెత్తిపోతున్న పట్టణవాసులు
చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

పాయకరావుపేట: పట్టణంలో పందులు, కోతులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిపగలు అనే తేడా లేకుండా వీధుల్లో సంచరించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నుల రూపంలో వేలాది రూపాయల వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు వీటిని నియంత్రించడంలో చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా డ్రైనేజీల్లో పూడిక తీయక, ఖాళీ ప్రదేశాల్లో రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్తా చెదారాలు పందులకు ఆవాసంగా మారాయి. గుంపులుగా రోడ్లపై సంచరించడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో పలువురిపై దాడి చేసి గాయపర్చిన సందర్భాలు లేకపోలేదు. గ్రామాలకు దూరంగా పొలాల్లోను, మైదాన ప్రాంతాల్లోను ఉంచాల్సిన పందులను ముఠా ఆనకట్ట సమీపాన వదిలేస్తున్నారు. దాంతో అవి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

కోతుల స్వైర విహారం...

పట్టణంలో ఇటీవల కోతుల సంచారం బాగా పెరిగిపోయింది. రేయింబవళ్లు ఇళ్లలోకి వెళ్లి వంట సామగ్రిని, వంటలను చిందరవందరం చేస్తున్నాయి. రాత్రిళ్లు మేడలపై తిష్ట వేయడం వల్ల ప్రజలు డాబాపైకి ఎక్కడానికి భయపడుతున్నారు. ఇళ్లలోనే కాకుండా వరండాల్లోను, కాంపౌండు వాల్‌లో ఏదైనా వస్తువు దొరికితే ఎత్తుకుపోయి దూరంగా పడేస్తున్నాయి. ఎవరైనా వాటిని అదిరిస్తే దాడి చేసేందుకు వెనుకాడటం లేదు. మేడలపైన, ఇంటి పైకప్పుల పైన, చెట్లపైన ఉంటూ పట్టణ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

గుంపులుగా కుక్కల సంచారం..

వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరించడం వల్ల వృద్ధులు, పిల్లలు సైతం భయపడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వరకూ కుక్కల బెడద తప్పడం లేదు. గతంలో పలువుర్ని దాడి చేసి గాయపర్చిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పందులు, కోతులు, కుక్కలను నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నియంత్రించాలి



పట్టణంలో పందులు, కోతులు, కుక్కల బెడద విపరీతంగా ఉంది. రాత్రి సమయంలో ఇళ్లపైన, మేడలపైన కోతులు తిష్ట వేస్తున్నాయి. ప్రజలపై దాడి చేస్తున్నాయి. పందులు, కుక్కలు రోడ్లపై గుంపులుగా సంచరించడం వల్ల భయపడుతున్నారు. వీటి నివారణ చర్యలు సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరుతున్నాం.

– కాధా రామకృష్ణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, పాయకరావుపేట

చర్యలు తీసుకుంటాం

పందుల పెంపకందారులను హెచ్చరించాం. పట్టణంలో పందుల బెడద లేకుండా చూస్తామన్నారు. కోతుల్ని పట్టించే విషయంలో ఆర్థికంగా నిధులు అవసరం కాబట్టి గ్రామ పంచాయతీ సమావేశంలో సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం. కుక్కల్ని పట్టించి దూర ప్రాంతాల్లో విడిచి పెట్టడానికి చర్యలు తీసుకుంటాం.

– సిహెచ్.ఆర్.కె. వర్మ, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి, పాయకరావుపేట

ఎమ్మెల్యేలు రైతుల పక్షమా.. విశాఖ డెయిరీ పక్షమా



04వైఎల్ఎం67: మునగపాకలో ఆందోళన చేస్తున్న రైతుసంఘ ప్రతినిధులు

మునగపాక: కూటమి శాసన సభ్యులు రైతుల పక్షమా? లేకుంటే విశాఖ డెయిరీ పక్షమా వెల్లడించాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను తక్షణమే పెంచాలన్నారు. మునగపాకలో శనివారం రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ వద్ద రైతులు రెండు దఫాలుగా జరిపిన చర్చల్లో భాగంగా ఆవు పాల ధరను పెంచుతామని చెప్పి రోజులు గడుస్తున్నా అమలు కాలేదన్నారు. విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేసి ప్రభుత్వం విచారణ చేపడుతుంటే, కొంతమంది ఎమ్మెల్యేలు విశాఖ డెయిరీని కొనియాడడం విచారకరమన్నారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. పాల సేకరణ ధర పెంచడంతో పాటు దాణా రేట్లను తగ్గించాలన్నారు. పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నేతలు వి.వి. శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, రైతులు పెంటకోట సూరిబాబు, ఆడారి రమణ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సదస్సు జయప్రదం చేయాలి



ఆటో డ్రైవర్లకు కరపత్రాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు శివాజీ

యలమంచిలి రూరల్: రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు. అనకాపల్లిలో జరగనున్న ఈ సదస్సుకు అఖిల భారత ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులంతా హాజరు కావాలని కోరారు. శనివారం పట్టణంలో పలువురు ఆటో, వ్యాన్ల డ్రైవర్లు, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ సంఘం యలమంచిలి మండల కన్వీనర్ ఎం. శ్రీనివాస్, గంగాధర్, లోవరాజు, అనిల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం



రీ-సర్వే డీటీ పడాల్‌కు దరఖాస్తు చేస్తున్న రైతు మంగారెడ్డి



ఎం.జగన్నాథపురం సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న దృశ్యం

మునగపాక: రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని రీ–సర్వే డీటీ పడాల్ అన్నారు. శనివారం కాకరాపల్లి రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గతంలో జరిగిన రీ–సర్వేకు సంబంధించి తేడాలుంటే, వాటిని సరి చేసుకోవచ్చన్నారు. సర్పంచ్ కొయ్య ముసిలినాయుడు, ఎంపీటీసీ ఇల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 7 అర్జీలు

అచ్యుతాపురం: ఎం.జగన్నాథపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ శైలజ ఏడు అర్జీలు స్వీకరించారు. కొరెడ్ల బుల్లమ్మ, వెంకటేష్, వీసం సత్యారావు, కొరెడ్ల సూర్యప్రకాశ్, పతివాడ చిన్నయ్యనాయుడు, పీలా శ్రీను, వీసం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో మోటార్ కార్మికుల సమస్యలపై నిరసన



ఆందోళన చేస్తున్న నాయకులు, ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు

రాంబిల్లి (యలమంచిలి): కొత్త రవాణా ట్రాన్స్‌పోర్ట్ చట్టం బీఎస్ఎస్ నుంచి రక్షణ కల్పించాలంటూ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, కనక దుర్గ ఆటో యూనియన్ అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. శనివారం రాంబిల్లిలో ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులతో కలసి ఆందోళన చేశారు. దేముడునాయుడు మాట్లాడుతూ కార్మికులు లేనిదే ఎటువంటి సరుకు రవాణా జరగదని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. అనకాపల్లిలో జిల్లా సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు మాధవరావు, అప్పారావు, తాతారావు, తాతాజీ, శేషు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బెయిలీకి ఘన నివాళి



గొడిచర్లలో బెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ బెయిలీ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. బెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధులకు బెయిలీ లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం అప్పారావు తెలిపారు. బ్రెయిలీ లిపి ద్వారా ఉబ్బెత్తుగా ఉన్న అక్షరాలను తాకి చదవడం ద్వారా నేర్చుకుంటారని ప్రత్యేక బోధన ఉపాధ్యాయిని యాస్మిన్ తెలిపారు. ఈ విధానం ద్వారా ఎటువంటి ఆటంకం లేని విద్య నేర్చుకోవడానికి అంధులకు అవకాశం ఉంటుందన్నారు. బ్రెయిలీ గొప్పదనాన్ని ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై చర్చించారు. తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని, మరలా అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్ఐ పి.ప్రసాదరావు, డీటీ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుడు



గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖపుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కొండపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన మూల విరాట్‌కు శనివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. కొండ దిగువన ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్యపూజలు నిర్వహించిన అనంతరం ఇత్తడి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతోనీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్టి,ప్రసాద వినియోగం జరిగింది. శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తిరువీధి సేవల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



కోటవురట్ల కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుజాత



విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లెక్చరర్లు



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఆర్.టి.సుజాత కళాశాల ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులకు భోజనం పెట్టించారు. సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు, టీడీపీ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు మెనూ ప్ర,కారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు, నాయకులు కోసూరు శ్రీను పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో ప్లస్ టూ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లెక్చరర్లు, ప్లస్ టూలో ఎంఈవోలు వై మీనాక్షి, అరుణ్ కుమార్ విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించారు. ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో పాఠశాలల అభివృద్ధి



హెచ్ఎంలకు, చైర్మన్లకు శిక్షణనిస్తున్న రిసోర్సుపర్సన్లు

యలమంచిలి రూరల్: ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సమన్వయంతో బాధ్యతగా పనిచేస్తే పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఎంఈవో అరుణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పాఠశాల యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులతో కలిసి సమష్టిగా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రిసోర్సు పర్సన్లు సీతా బాలాజీ, వేగి రాజాబాబు శిక్షణలో భాగంగా పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటు, విధులు, బాధ్యతలను వివరించారు. స్వచ్ఛ విద్యాలయం, లింగ సంబంధిత వివక్ష, బడి బయట పిల్లలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ల నిర్వహణ నిధి, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పాఠశాల సామాజిక తనిఖీ, పాఠశాలల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 వై మీనాక్షి, 51 స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ



ఉపాధ్యాయుల సమస్యలు గురించి చర్చిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

యలమంచిలి రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ తెలిపారు. శనివారం ఆయన యలమంచిలి పట్టణంలో పలు ప్రభుత్వ స్కూళ్లను సందర్శించారు. జీవో నెంబరు 117ను రద్దు చేసి పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా బోధన తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి దూరంగా ఉంచాలని కోరారు. తనకు మొదటి ప్రాధాన్య ఓటు చేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఏపీటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎస్ ధర్మారావు, మాజీ అధ్యక్షుడు ఎన్వీ సూర్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కే శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బొడ్డేడ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర క్షీరవిప్లవ సారథి తులసీరావు



తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు



తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్, రమాకుమారి

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర క్షీరవిప్లవ సారథి దివంగత ఆడారి తులసీరావు ద్వితీయ వర్ధంతి కార్యక్రమం శనివారం యలమంచిలి పట్టణానికి సమీపంలో తులసీరావు స్మృతి వనంలో నిర్వహించారు. ఇక్కడ స్మృతివనంలో తులసీరావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన కుటుంబ సభ్యులు, విశాఖ డెయిరీ పాలకవర్గం, తులసీరావు అనుచరులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రైతాంగానికి తులసీరావు చేసిన సేవలను కొనియాడారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, తులసీరావు కుటుంబ సభ్యులు, డెయిరీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మునగపాక: పాడి రైతుల సంక్షేమం కోసం విశాఖ డెయిరీ చైర్మన్, దివంగత తులసీరావు ఎనలేని సేవలందించారని మూలపేట పాల సంఘం అధ్యక్షుడు శరగడం నాగేశ్వరరావు అన్నారు. శనివారం మూలపేట పాల సేకరణ కేంద్రం ఆవరణలో తులసీరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు రైతులు నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేయడంతో పాటు ఐకాన్ ఆస్పత్రిలో సుఖీభవ కార్డులున్న రైతులకు మెరుగైన వైద్య సేవలందించారని కొనియాడారు.

ఘనంగా తిరువీధోత్సవం



తిరువీధోత్సవంలో సీతారామస్వామి పల్లకి

ఎస్.రాయవరం: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని కొరుప్రోలు సీతారామస్వామి ఉత్సవ మూర్తులను తిరువీధోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. మకర సంక్రాతి వరకు స్వామి ఊరేగింపు నిత్యం ఉంటుందని ప్రధాన అర్చకుడు కుమార్ తెలిపారు.